ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

ఆదివారం 27 ఏప్రిల్ 2025

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ
- భీమన్న ఆలయంలో శనిత్రయోదశి పూజలు 6

టీజీ ఐపాస్ అనుమతులు జారీ చేయాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా 8



జిల్లెల్ల కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

- నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు.. రోడ్డెక్కుతున్న రైతులు
- కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు
- యాసంగి దిగుబడి అంచనా 3.67 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు కొనుగోలు 31,454 మెట్రిక్ టన్నుల ధాన్యం
- కొనుగోలు కేంద్రాల వద్ద వెక్కిరిస్తున్న ధాన్యం కుప్పలు
- మరోవైపు అకాల వర్షం.. వడగండ్ల భయం

కొనుఘొల్లు

ఆంధ్రజ్యోతి విజిట్

(ఆంధ్రజ్యోతి/నెట్‌వర్క్)

అన్నదాతల ఆశలకు కష్టాలు తోడయ్యాయి. యాసంగి ధాన్యం అమ్ముకోవడానికి రైతులు నానా తిప్పలు పడుతున్నారు. రవాణా, కాంటాల జాప్యంతో కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి రైతులు పడిగాపులు కాస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో భగ్గుమంటున్న ఎండల్లో సౌకర్యాలు లేక చెట్ల నీడలో ఉంటూ ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. ఆవేదనకు గురైన రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా అధికార యంత్రాంగం మాత్రం నామామాత్రంగా స్పందిస్తు న్నారనే విమర్శలు ఉన్నాయి. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలుపై 'ఆంధ్రజ్యోతి' బృందం క్షేత్రస్థాయిలో కేంద్రాలను విజిట్ చేసి రైతుల ఆవేదనను తెలుసుకుంది.

జిల్లాలో 244 కేంద్రాలు..

యాసంగిలో రైతులు వరి సాగు వైపు మొగ్గు చూపారు. ఇంట్లో సిరులు కురిపిస్తుందని ఆశపడ్డ రైతులకు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలు పోసుకొని ఎదురుచూస్తున్నారు. కేంద్రాల వద్దకు లారీలు రాకపోవడం, రైస్‌మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వకపోవడంతో ధాన్యాన్ని గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా టెక్స్‌టైల్ వీవింగ్ పార్కులో నిర్మించిన షెడ్లను ఉపయోగించుకుంటున్నారు. అయినా జిల్లాలో కొనుగోళ్లలో వేగం మాత్రం పెరగడం లేదు. జిల్లాలో 246 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఐకేపీ ద్వారా 192 కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 46 కేంద్రాలు, డీసీఎంఎస్ ఒకటి, మెప్మా 7 కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా 244 కేంద్రాలు ప్రారంభించారు. ఇందులో 234 కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు జరుగుతున్నాయి. జిల్లాలో 1.78 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. ఇందులో 2.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డురకం, 8 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్న రకం వస్తుందని అంచనాలు వేశారు. ఇందులో పౌర సరఫరాల శాఖ 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అంచనా వేసింది. ఏప్రిల్ మాసంలో 75 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉండగా 31 వేల 454 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఐకేపీ ద్వారా 25,230 మెట్రిక్ టన్నులు, సింగిల్‌విండోల ద్వారా 5,372మెట్రిక్ టన్నులు, డీసీఎంఎస్ ద్వారా 312 మెట్రిక్ టన్నులు, మెప్మా ద్వారా 539 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 23,344 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్రాల నుంచి తరలించారు. 4,282 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 31,454 మెట్రిక్ టన్నుల ధాన్యంలో 212 మంది రైతులకు సంబంధించి 1,165 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ఆన్‌లైన్ చేశారు. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో 40 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు రూ.9 లక్షల వరకు మాత్రమే జమ చేశారు. నత్తనడకన సాగుతున్న కొనుగోళ్లకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అన్నదాతల ఆందోళనలు..

కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం, ధాన్యం రవాణాకు లారీలు రాకపోవడం, కాంటా పెట్టకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్న రైతులు ప్రతి రోజు ఏదో ఒక కేంద్రం వద్ద ఆందోళనలు చేస్తున్నారు. వీర్నపల్లి మండల రైతులు జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. కోనరావుపేట మండలం అజ్మీరా తండా మహిళా రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. గంభీరావుపేట, చందుర్తి, ఇల్లంతకుంట ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో రైతులు ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై నిరసనలు, ఆందోళనలు నిర్వహించారు. మరోవైపు వడగళ్లకు వరిపంటతో పాటు నష్టం వాటిల్లుతుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు రైతులు ధాన్యాన్ని దళారులకు నష్టానికి విక్రయించుకుంటున్నారు. తేమ ఉన్న ధాన్యం క్వింటాలుకు రూ.1850, తేమ లేని ధాన్యం రూ.2050 నుంచి రూ.2100 వరకు అమ్ముకుంటున్నారు.

లారీల కొరత.. కనీస వసతులు కరువు

తంగళ్లపల్లి: లారీల కొరత.. వరిధాన్యం ఆరబోసుకోవడానికి స్థలం కొరత.. తాగునీరు కరువు.. నిలువ నీడ లేక ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం తంగళ్లపల్లి మండలంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించగా, నెల రోజుల క్రితం ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు పడిగాపులు కాస్తూ కనిపించారు. లారీలు రావడంలో జాప్యం కావడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. జిల్లెల్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో సరిపడా లారీలు రావడం లేదు. ధాన్యాన్ని ఆరబోసుకోవడానికి ఖాళీ స్థలం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు నిల్వ నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లెల్లలో గతంకంటే ప్రస్తుతం వరిధాన్యం విక్రయంలో ఇబ్బందులు లేవు.

తరుగు పేరిట 2.5 కిలోలు కోత..

ఎల్లారెడ్డిపేట: మండలంలో సెర్ప్-ఐకేపీ ఆధ్వర్యంలో మొత్తం 26 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో తూకం వేయడంలో జాప్యం వల్ల ధాన్యం

మిగతా 8లో..









సిరిసిల్ల పెద్దూర్‌లో, ఇల్లంతకుంట కేంద్రంలో, లాల్‌సింగ్ తండా కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేటలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఉదయం గణపతి, గౌరీ, నవగ్రహా, రుద్రాభిషేకం, సింధూరపూజ, రుద్ర హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను జరిపించారు. హోమంలో దంపతులు భక్తిశ్రద్ధల నడుమ పాల్గొన్నారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, వివిధ పార్టీల నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మార్కండేయులు, ఆంజనేయులు, నర్సయ్య, రాజు, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లు వృథా నీటిని పరిశీలించిన అధికారులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి శివారులోని పారాబాయిల్డ్ రైస్‌మిల్లు నుంచి వృథా నీరు వల్ల తమ పొలాలకు నష్టం వాటిల్లుతోందనే రైతుల ఫిర్యాదుతో రామగుండంలోని కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి జ్యోతి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైస్ మిల్లుల నుంచి బయటకు వస్తున్న నీటి సమూనాలను సేకరించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని అధికారి జ్యోతి పేర్కొన్నారు.

డీసీఆర్బీ డీఎస్పీగా శ్రీనివాస్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా డీసీఆర్బీ డీఎస్పీ అనుమసు శ్రీనివాస్ నియమిస్తూ శనివారం రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో పనిచేస్తున్న శ్రీనివాస్‌ను సిరిసిల్ల డీసీఆర్బీ డీఎస్పీగా నియమించారు.

ఓకే పాఠశాలలో ఇద్దరు ప్రధానోపాధ్యాయులు

- సర్దుబాటు చేయాలని ఎస్‌జీటీయూ నాయకుల వినతి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రాజీవ్‌నగర్ ప్రభుత్వం పాఠశాలలో ఇద్దరు ప్రధానోపాధ్యాయులు పనిచేస్తున్నారని అందులో ఒకరి సర్దుబాటు చేయాలని ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు బారాజు రమణరెడ్డి, ప్రధానకార్యదర్శి గోనే సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసాల హరిప్రసాద్‌లు కోరారు. కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం సూపరింటెండెంట్ గోనే భూపతిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్‌నగర్ పాఠశాలలో రెగ్యూలర్ ప్రధానోపాధ్యాయులు భూపతి పనిచేస్తుండగా చందుర్తి మండలం కిష్టంపేట పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో అక్కడ పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు వెంకటేశంను రాజీవ్ నగర్ పాఠశాలకు కేటాయించారన్నారు. ఇద్దరు ప్రధానోపాధ్యాయులు ఒకే పాఠశాలలో కొనసాగడం ఇబ్బందిగా ఉందన్నారు. ఆ పాఠశాల రెగ్యూలర్ ప్రధానోపాధ్యాయుడు భూపతిని అధికారులు బదిలీచేయడం దురదృష్టకరమన్నారు. సర్దాబాటులో వచ్చి వెంకటేశంను అతడు పనిచేసిన కిష్టంపేట పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడాల భూపతి, దూస మధు, శ్రీరాం అశోక్, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

- మండల విద్యాధికారి రఘుపతి



ప్రధానోపాధ్యాయుడు రాజు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఏదో ఒకరోజు పదవీ విరమణ తప్పదని సిరిసిల్ల మండల విద్యాధికారి దూస రఘుపతి అన్నారు. సిరిసిల్ల పట్టణం పెద్దూర్, బాబాజీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న రేపాక రాజు ఈనెల 30న పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా శనివారం సిరిసిల్ల పట్టణం వాసవి కల్యాణ మండపంలో ఆత్మీయ అభినందన సన్మాన సభ జరిగింది. ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి రఘుపతి ముందుగా రాజు దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ రేపాక రాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 37 సంవత్సరాల పాటు పనిచేసి ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. పదవీవిరమణ అనంతరం కుటుంబంతో ప్రశాంతమైన వాతావరణంలో జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయులు, పదవీవిరమణ చేసిన ఉపాధ్యాయులు రాజు దంపతులను ఘనంగా సన్మానించారు.

భూ సమస్యల పరిష్కారమే 'భూ భారతి' లక్ష్యం

- పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులకు మోక్షం - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

తంగళ్ళపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నూతన ఆర్వోఆర్, భూ భారతి చట్టం రూపకల్పన చేసిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి చట్టం-2025 అమల్లోకి వచ్చిందని, ముందుగా రాష్ట్రంలోని 4మండలాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారన్నారు. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసీల్దార్ విచారణ జరిపి హక్కుల రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని, నిర్ణీత గడువు 30 రోజుల లోగా పూర్తిచేయకుంటే ఆటోమేటిక్‌గా మ్యూటేషన్ జరుగుతుందని అన్నారు. భూముల రిజిస్ట్రేషన్ మ్యూటేషన్ సమయంలో తప్పనిసరిగా భూమి పటం అందుబాటులో ఉండాలని, మండలాల్లో లైసెన్స్ సర్వేయర్ల ద్వారా భూమి మ్యాప్ తయారుచేస్తేనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరిగేలా చట్టంలో వ్యవస్థ కల్పించామన్నారు. ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూభారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారని, దరఖాస్తుదారునికి ఏమైనా అభ్యంతరాలుంటే కలెక్టర్, భూమి ట్రిబ్యూనల్‌లో అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చని, గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, ఇప్పుడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు. అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టు వెళ్లవచ్చని, దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డుల తయారుచేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్‌ప్లే చేస్తారన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామపరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మనిషికి ఆధార్ కార్డులాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ఒకేరోజు ఉంటాయన్నారు. కొనుగోలు, దానం తనకా, బదిలీ, భాగ పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులు మార్పులు చేసి పట్టాదార్ పాస్‌పుస్తకం జారీ చేస్తారన్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేలా కరపత్రాలను పంపిణీ చేశామని, ప్రజలు వీటిని గమనించాలని ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ వెలుముల స్వరూప, సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నర్సింగం, తహసీల్దార్ జయంత్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడలోని సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో సీసీ కెమెరాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో వివిధ ప్రాంతాలను అనుసంధానిస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఏఎస్పీ కార్యాలయం ద్వారా మానిటర్ చేయడం మంచి విషయం అన్నారు. కిడ్నాప్‌లు, దొంగతనాలు వంటి ఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ఆధారంగా నేరస్తులను త్వరగా పట్టుకుంటున్నారని, సీసీ కెమెరాలతో పాటు ఆధునిక సాంకేతికతను మరింత విరివిగా ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. రుద్రంగి పోలీసు స్టేషన్ భవన నిర్మాణం కోసం రెండున్నర కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, వేములవాడలో ట్రాఫిక్, మహిళా పోలీసు స్టేషన్, జిల్లా కేంద్రంలో మహిళా, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ రావాల్సిన అవసరం ఉందని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే క్యాంప్ కార్యాలయాన్ని డీఎస్పీ కార్యాలయనికి అప్పగించామని, భవిష్యత్తులో ఈ భవనాన్ని ఇతర ప్రభుత్వ కార్యాలయాల కోసం ఉపయోగించుకుంటామని అన్నారు. పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణంలో రాత్రి 11-30 గంటల వరకు దుకాణాలు తెరిచి ఉంచేలా చూడాలని సూచించారు. వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహపూర్వకంగా మెదలాలని, ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, టౌన్ సీఐ వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవం టీఆర్ఎస్‌కా..? బీఆర్ఎస్‌కా..?

- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : టీఆర్ఎస్ పార్టీకా, బీఆర్ఎస్ పార్టీకా రజతోత్సవం.. జాతీయ వాదమా, ప్రాంతీయ వాదమా అన్నది బహిరంగ సభకు వెళ్లే ముందు కేసీఆర్ ప్రజలకు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ వేదికగా నిర్వహిస్తున్న రజతోత్సవ బహిరంగ సభకు వెళ్లే ముందు కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీ రజతోత్సవమా, బీఆర్ఎస్ రెండో వార్షికోత్సవ సభనా ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ జాతీయ పార్టీ అధ్యక్షుడా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడా తేల్చిచెప్పాలన్నారు. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ప్రాంతంలో వడగళ్ల వానలు పడి నష్టం వాటిల్లినా రైతులు, ప్రజల కష్టనష్టాల్లో నిలబడలేదని ఆరోపించారు. వరంగల్ బహిరంగ సభ హరీష్‌రావు ఆధ్వర్యంలో నడుస్తుందని పత్రికా ముఖంగా కేసీఆర్ చెప్పాక రాత్రికి రాత్రి కేటీఆర్ వచ్చాడన్నారు. బహిరంగ సభ తరువాత కుర్చీల కొట్లాటలో హరీష్‌రావు పక్కకు పోవడం ఖాయమని ప్రజలు భావిస్తున్నారన్నారు. స్కాంలలో దోచుకొని దాచుకొన్న అవినీతి సొమ్ముతో ప్రజలను సభకు తరలిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనితనళినీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వెంకటేశం, కాసర్ల రాజు, మాజీ కౌన్సిలర్లు ఆడెపు చంద్రకళ, యెల్లె లక్ష్మీనారాయణ, కుడికాల రవికుమార్, కత్తెర దేవదాస్, వైద్య శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో కలెక్టర్ సతీమణి ప్రసవం


కుమారుడితో కలెక్టర్ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష భార్య విజయ శనివారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రసవించారు. రెండో కాన్పులో భాగంగా నెలలు నిండడంతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించగా రాత్రి వైద్యులు సీజేరియన్ చేయగా మగశిశువుకు జన్మనిచ్చింది. మొదటి నుంచి కలెక్టర్ సతీమణి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్షలు చేయించుకుంటున్నారు.

అంత్యక్రియలకు వచ్చి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో గాయపడి యువకుడి మృతి
- అంతిమయాత్రలో ప్రమాదవశాత్తు యువకుడి బంధువు దుర్మరణం


రాజశేఖర్ (ఫైల్)

హుజూరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి తన బంధువు మృతి చెందాడని అంత్యక్రియలకు వచ్చి ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి అనంతలోకానికి వెళ్లిన సంఘటన హుజూరాబాద్‌లో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హుజూరాబాద్ పట్టణంలోని ప్రతాపవాడకు చెందిన రాజశేఖర్ (18) అనే యువకుడు వారం రోజుల క్రితం మండలంలోని తేలకలపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అతని బంధువు హుస్నాబాద్‌కు చెందిన ఇస్లావత్ వెంకట్ (35) హుజూరాబాద్‌లో రాజశేఖర్ అంత్యక్రియలకు శనివారం హాజరయ్యాడు. అంతిమయాత్ర జరుగుతుండగా ఆగి ఉన్న మోటర్ సైకిల్‌పై వెంకట్ కూర్చున్నాడు. ప్రమాదవశాత్తు మోటర్ సైకిల్ పైనుంచి జారి మురికి కాలువలోని బండపై పడ్డాడు. దీంతో వెంకట్ తలకు తీవ్రమైన గాయమైంది. గమనించిన స్థానికులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. కాగా బంధువు అంత్యక్రియలకు వచ్చి మరో వ్యక్తి మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఫీల్డ్ అసిస్టెంట్ల వేతన వెతలు

- ఉపాధిహామీలో మూడు నెలలుగా పెండింగ్
- కుటుంబ పోషణకు ఆర్థిక ఇబ్బందులు
- రాష్ట్ర వ్యాప్తంగా 7,600 మంది ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు

జగిత్యాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులతో విలవిలలాడుతు న్నారు. అప్పు లు చేసి కుటుంబాలను పోషించాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈజీఎస్‌లో సుమారు 7,600 మంది పనిచేస్తుండగా జగిత్యాల జిల్లాలో 264 మంది ఉన్నారు. ఈజీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తు న్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను వారి పని విధానం ఆధా రంగా మూడు గ్రేడ్లుగా విభజించారు. ఇందులో గ్రేడ్-1 ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.12,200, గ్రేడ్-2 ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.10,120, గ్రేడ్-3 ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.9,100 వేతనం చెల్లిస్తు న్నారు. అరకొర జీతాలతో ఫీల్డ్ అసిస్టెంట్లకు కుటుంబ పోషణ ఇబ్బందిగా తయారైంది. దీనికి తోడు ఈ యేడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాలకు సంబంధించిన జీతాలు ఇప్పటి వరకు రాలేదు. వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధు లను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందు కేంద్రం స్పర్శ్ అనే సాఫ్ట్‌వేర్‌ను కొత్తగా తీసుకొచ్చింది. దీనిలో సమస్యలు తలెత్తడంతో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

కీలక బాధ్యతలు

ఉపాధి కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కీలకంగా వ్యవహరిస్తుంటారు. ఉపాధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు సకాలంలో వేతనాలు అందడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.25 వేల వేతనం అందించాలని వారు కోరుతున్నారు. హెల్త్ కార్డులు జారీ చేయాలని, విధి నిర్వహణలో మరణిస్తే రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వానికి విన్నవిస్తు న్నారు. తమ గోడును ప్రభుత్వానికి ఎన్నిమార్లు మొర పెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపించి మూడు నెలల పెండింగ్ వేతనాలు అందించి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

-ముదిగొండ శ్యామలయ్య, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర నాయకులు



రాష్ట్రంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు రావాల్సిన మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి. ఫీల్డ్ అసిస్టెంట్లను ఉద్యోగులుగా గుర్తించి పే స్కేల్ అమలు చేయాలి. ఇందుకు అనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేసి ఆర్థిక శాఖ అనుమతికి పంపాలి. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలి.

వేతనాలు సకాలంలో అందకపోవడంతో ఇబ్బందులు

-గడ్డం రమేశ్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి



ఒక్కో గ్రామ పంచాయతీకి ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ ఉండాల్సి ఉంది. గత ప్రభుత్వం నూతనంగా అనేక గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసినప్పటికీ ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం చేపట్టలేదు. దీంతో ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ మూడు, నాలుగు గ్రామపంచాయతీల బాధ్యతలను చూసుకోవల్సి వస్తోంది. దీనికి తోడు వేతనాలు సైతం ప్రతి నెలా అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పుస్తెల తాడు అపహరణ

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో ఓ మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు అపహరణకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నెబోయిన కోమల అనే మహిళ ఈ నెల 25న ఇంటి బయట అర్ధరాత్రి నిద్రిస్తున్న క్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మెడలో నుంచి పుస్తెల తాడును గుంజుకుని పారిపోయాడు. ఈ మేరకు బాధితురాలు కోమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

అస్వస్థతకు గురై వ్యక్తి మృతి

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోజన్నపేట గ్రామానికి చెందిన జక్కం రాంనారాయణ (48) అనే వ్యక్తి అస్వస్థతకు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రోజు వారిగానే శుక్రవారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో చెక్ పోస్ట్ వద్ద రాంనారాయణ విధులు నిర్వహించారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు డ్యూటీకి వెళ్లిన రాంనారాయణ 11 గంటలకు ఇంటికి తిరిగి వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం నివేదిక రాగానే తెలుస్తుందని సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. మృతుడికి భార్య వనిత, కొడుకు రిషేంద్ర, కూతురు సుచరిత ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

వరకట్నం కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం వేధించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గ రాజేశ్వరతండాకు చెందిన గుగులోతు అనిల్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. గ్రామంలోని అనిల్‌కు ఆరేళ్ల క్రితం మేరీతో వివాహమైందన్నారు. కొంతకాలం పాటు మేరీని సరిగా చూసుకున్న భర్త పుట్టింటి నుంచి అదనంగా కట్నం తీసుకురావాలని వేధింపులకు దిగాడన్నారు. గతంలో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. దాంతో ఇరువర్గాల పెద్దలు కల్పించుకొని భార్యాభర్తలు కలిసిమెలిసి ఉండాలని పేర్కొన్నట్లు తెలిపారు. అయినా అతనిలో మార్పురాకపోవడంతో ఈనెల 25న భార్య మేరీని కట్నం తీసుకు రావాలని వేధించడంతో పాటు దాడికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

వైకుంఠధామంలో కొరవడిన వసతులు

- సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో దహన సంస్కారాలు
- ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్థులు


సెల్ ఫోన్ లైట్ల వెలుతురులో దహన సంస్కారాలు నిర్వహిస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

వెల్గటూర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో అంత్యక్రియలను చీకట్లో నిర్వహించే దుస్థితి తలెత్తింది. అధికారుల నిర్లక్ష్యం మృతి చెందిన వారి కుటుంబీకులకు శాపంలా మారింది. వెల్గటూర్‌లోని వైకుంఠధామం ఇందుకు నిదర్శనం. శుక్రవారం వెల్గటూర్‌లో ఓ వ్యక్తి మృతి చెందగా అంత్యక్రియలు నిర్వహించడానికి రాత్రి వేళ అయింది. వైకుంఠధామంలో కనీసం విద్యుత్ సౌకర్యం మెరుగు పరచలేదు. బోరు సౌకర్యం కూడా కల్పించలేదు. దీంతో దిక్కుతోచని పరిస్థితిలో ఆ బాధిత కుటుంబం తమ కుటుంబ సభ్యుడి దహన సంస్కారాలు సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో నిర్వహించారు.

వైకుంఠధామం వద్ద కనీస వసతులు కల్పించకపోవడంతో గ్రామస్థులు పంచాయితీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ శేఖర్‌ను వివరణ కోరగా వైకుంఠధామం వద్ద విద్యుత్ లైట్లు పనిచేయని విషయం తమ దృష్టికి రాలేదని, వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో విద్యుత్ సౌకర్యం మెరుగు పరుస్తామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డెక్కిన రైతులు

కోనరావుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యం జరుగుతోందని మహిళా రైతులు రోడ్డెక్కి రాస్తారోకో నిర్వహించారు. కోనరావుపేట మండలం అజ్మీర తండాలో లారీల కొరత వల్ల ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతోందని రోడ్డుపై బైఠాయించి ధాన్యం బస్తాలతో రాస్తారోకో నిర్వహించారు. ధాన్యాన్ని తగలబెడుతూ నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌తో పాటు మహిళా రైతులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న మహిళా రైతులు

గుండెపోటుతో రిమాండ్ ఖైదీ మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మహ్మద్ సాదుల్లా(29) అనే యువకుడు శనివారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందినట్లు జైలు సూపరింటెండెంట్ విజయ్ డేని తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన సాదుల్లా ఈ నెల 18న చోరీ కేసులో కరీంనగర్ జిల్లా జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చాడు. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఛాతిలోనొప్పి వస్తోందని సాదుల్లా జైలు సిబ్బందికి చెప్పాడు. సిబ్బంది వెంటనే కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా వేకువజామున మూడు గంటల ప్రాంతంలో గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సాదుల్లా మృతదేహానికి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం పూర్తిచేసి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు జైలు అధికారులు తెలిపారు. పోలీసుల దెబ్బలతోనే సాదుల్లా మరణించాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత..

మంథనిరూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మంథని మండలం లక్కేపూర్ గ్రామ శివారులో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన మాసు రమాదేవి (36) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మంథని సీఐ రాజు కథనం ప్రకారం.. శనివారం లక్కేపూర్ శివారులో గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యం కావడంతో విచారణ చేపట్టగా మాసు రమాదేవిగా గుర్తించామన్నారు. ఆమె భర్త సత్యనారాయణ మృతదేహాన్ని గుర్తించి తన భార్యను హత్య చేశారని, లక్కేపూర్ గ్రామానికి చెందిన పండుగు మొగిలిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన కాసాని వేణు(26) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా సర్జరీ, చికిత్స చేయించారు. తిరిగి మళ్లీ తీవ్రంగా కడుపు నొప్పి రావడంతో భరించలేక శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగాడు. ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా శనివారం మృతిచెందాడు. మృతుడి తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

చీర్లవంచలో ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

తంగళ్లపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన మ్యాక కొమురయ్య(43) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... పది సంవత్సరాలుగా అనారోగ్యం, కూతుళ్ల పెళ్లిళ్లకు చేసిన అప్పులు పేరుకుపోయాయి. అనారోగ్యంతో పనిచేయలేని పరిస్థితి, అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపానికి గురై శనివారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణ చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. కొర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్ర మంగా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్, యజమాని నేదురి రాజ్‌కుమార్, సుద్దాల దేవుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి శనివారం తెలిపారు.

ఆలయాల్లో భక్తుల సందడి

- భీమన్న ఆలయంలో శనిత్రయోదశి పూజలు


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు


మహాలింగార్చనలో పాల్గొన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి వేములవాడకు తరలి వచ్చిన భక్తులు ఉదయం ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకొని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు.

- శనిత్రయోదశిని పురస్కరించుకుని వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలోని శనీశ్వరుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే నువ్వుల నూనే, నల్లటి వస్త్రాన్ని శనీశ్వరుడికి సమర్పించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

ఘనంగా మహాలింగార్చన

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. మాసశివరాత్రిని పురస్కరించుకుని శనివారం ఉదయం స్వామివారికి మహాన్యాసపూర్తక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీస్వామి వారి అద్దాల మండపంలో అర్చకులు లింగాకృతిలో దీపాలను వెలిగించి మహాలింగార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

కొండగట్టులో..

మల్యాల (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేకువజాము నుంచే వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముడి ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

వాహనాల పార్కింగ్‌కు పాట్లు

కొండగట్టు అంజనేయస్వామి ఆలయ కార్యాలయం ఎదుట గల పార్కింగ్ వద్ద భక్తులు తమ వాహనాలను నిలపడం, తీయడం కోసం అనేక పాట్లు పడ్డారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేసిన అధికారులు రెండు మార్గాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఒకటే ఏర్పాటు చేశారు. దీంతో పార్కింగ్ స్థలంలోకి వాహనాలు వెళ్లడం, రావడం సమస్యగా మారి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రతి మంగళ, శనివారాల్లో వేలాదిగా భక్తులు వందలాది వాహనాల్లో కొండపైకి చేరుకుంటారు. వారందరికీ పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. శనివారం పార్కింగ్ వద్ద గల ప్రవేశద్వారం వద్ద ఎదురెదురుగా వాహనాలు రావడంతో ఓ కారు అక్కడ గల మురుగు కాలువలో దిగబడడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

నరసింహుడి సన్నిధిలో..

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. సెలవు దినాలు కావడంతో ఉదయం వరకు క్షేత్రం భక్తులతో రద్దీగా అగుపించింది. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

వృద్ధుడి మృతిపై అనుమానం

- మూడు రోజులకు అంత్యక్రియలు

మానకొండూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన జంగిలి కొమురయ్య (74) అనే వృద్ధుడు ఈ నెల 24 మృతి చెందినట్లు సీఐ సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుకి ఇద్దరు కుమారులు ఓదెలు, రవి, ఇద్దరు కుమార్తెలు ఉండగా భార్య గతంలో అనారోగ్యంతో మృతి చెందింది. గత కొంత కాలంగా మృతుని కుమారుల మధ్య భూతగాదాలు ఉండడంతో తండ్రీ మరణంపై ఒకరిపై ఒక్కరు అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిపారు. దీంతో బ్లూకోల్ట్ కానిస్టేబుల్ వెంకట్రామయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మూడు రోజులుగా కుమారులు విచారణకు సహకరించలేదని సదరు కానిస్టేబుల్ వెంకట్రామయ్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పజెప్పారు. దీంతో మూడో రోజు గ్రామంలో అంత్య క్రియలు నిర్వహించగా కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాంక్రీట్ మిక్సర్ కిందపడి కూలీ మృతి

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో కాంక్రీట్ మిక్సర్ కింద పడి జనగామ జిల్లా దర్దేపల్లి గ్రామానికి చెందిన వలస కూలీ జలగం ఎల్లయ్య (33) మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం నర్సింగాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేయడానికి ఎల్లయ్య నర్సింగాపూర్‌కు శనివారం వచ్చాడు. సీసీ రోడ్డు పనుల్లో భాగంగా మట్టిని ఎల్లయ్య లెవలింగ్ చేస్తుండగా కాంక్రీట్ మిక్సర్ డ్రైవర్ ఒల్లపురాములు అజాగ్రత్తగా నడిపి ఎల్లయ్య తలపై ఎక్కించాడు. దీంతో తల నుజ్జునుజ్జయి ఎల్లయ్య అక్కడిక్కడే మృతిచెందాడు. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గడ్డం మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్యాంకులో చోరీకి యత్నం

మానకొండూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండపల్కలలో గల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో శుక్రవారం అర్ధరాత్రి చోరీకి యత్నించాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బ్యాంకులో దొంగతనం చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి షెటర్ తాళాలను పగుల కొడుతుండగా చుట్టుపక్కల వారు శబ్దానికి లేచి అరవడంతో దొంగ పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న సీఐ సంజీవ్ సంఘటనా స్థలానికి చేరుకొని చోరీకి యత్నించిన తీరును పరిశీలించారు.

తహసీల్దార్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

అంతర్గాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్‌పటేల్‌పై శనివారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. తహసీల్దార్ కులం పేరుతో దూషించారని ముర్మూర్ గ్రామానికి చెందిన ఉరిమెట్ల సుజాత రాజలింగం ఎస్ఐ వెంకటస్వామికి ఫిర్యాదు చేశారు. ముర్మూర్ గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్న తహసీల్దార్ రెండు రోజుల క్రితం గ్రామంలో గ్రామ సభ నిర్వహిస్తుండగా ఉరిమెట్ల సుజాత డ్రైనేజీలో పూడిక తీయడం లేదంటూ సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఆవేశానికి గురైన తహసీల్దార్ తనను కుల వివక్షతో దూషించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తహసీల్దార్ తూము రవీందర్ పటేల్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య: జగిత్యాలలో విషాదం


జశ్వంత్(ఫైల్)

జగిత్యాల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్స రంలో ఫెయిల్ అవడంతో జగిత్యాలకు చెందిన బూసి జశ్వంత్ (17) అనే విద్యార్థి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాల హాస్టల్‌లో శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడడంతో జగిత్యాలలో విషాదం నెలకొంది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని 16వ వార్డు కు చెందిన బూసి వెంకటరెడ్డి-వసంత దంపతుల పెద్ద కుమారుడు బూసి జశ్వంత్ హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ కార్పొరే ట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల విడుద లైన మొదటి సంవత్సరం ఫలితాల్లో మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అవడంతో మనోవేదనకు గురైన జశ్వంత్ హైదరాబాద్‌లోని తాను చదివే కళాశాల హాస్టల్‌లో శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళాశాల సిబ్బంది మృతుడి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో బాధిత కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. హైదరాబాద్‌లో పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని జగిత్యాలకు తీసుకువచ్చి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

లీజు డబ్బులు ఇవ్వరు.. కాంట్రాక్టు రద్దు చేయరు

- ఇసుక రీచ్‌ల కోసం 600 ఎకరాలకు పైగా భూముల లీజు
- పంటలు పండించుకోక రైతుల అవస్థలు
- టీజీఎండీసీ అధికారుల నిర్వాకంతో నష్టం



పెద్దపల్లి జిల్లా గుండ్లపల్లి ఇసుక క్వారీ డంపింగ్ యార్డు వద్ద పంట పొలాలను అనుకుని ఉన్న ఇసుక

పెద్దపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మానేరు నది నుంచి ఇసుక తోడేందుకు గుర్తించిన ఇసుక క్వారీల కోసం పంట భూములను లీజుకు ఇచ్చిన రైతులు లబోదిబోమంటున్నారు. ఇసుక క్వారీలు నిలిచిపోవడంతో వారికి టీజీఎండీసీ నుంచి రావాల్సిన లీజు డబ్బులు రాక, క్వారీల కాంట్రాక్టును, భూముల లీజులను టీజీఎండీసీ అధికారులు రద్దు చేయక రైతులు పంటలు పండించుకోలేక పోతున్నారు. ప్రతి ఏటా రెండు పంటలను పండిస్తున్న రైతులు ఇసుక క్వారీల డంపింగ్ యార్డులు, రహదారులు, వే్‌బ్రిడ్జిల కోసం ఒక్కో క్వారీ కోసం 30 నుంచి 40 ఎకరాల భూములకు ఒక్కో ఎకరానికి ఏడాదికి 60వేల రూపాయల నుంచి 80వేల రూపాయలకు లీజుకు ఇచ్చారు. ఇలా 23 క్వారీలకు 600 ఎకరాలకు పైగా భూములను లీజుకు ఇచ్చారు. రెండేళ్లుగా ఇసుక క్వారీలు నిలిచిపోవడంతో రైతులకు రావాల్సిన డబ్బులు రాక, కాంట్రాక్టులు రద్దుకాక పంటలు సాగు చేసుకునే పరిస్థితి లేక ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆ భూముల్లో కొన్నిచోట్ల ఇసుక డంపులు ఉండగా, కొన్ని ఖాళీగానే ఉన్నాయి. టీజీఎండీసీ అధికారులు ఏర్పాటు చేసిన వే్‌బ్రిడ్జి యంత్రాలు, క్యాబిన్లు కూడా తుప్పు పట్టి పోతున్నాయి. పెద్దపల్లి జిల్లా మానేరు నదిపై గత ప్రభుత్వ హయాంలో పలు చోట్ల చెక్‌డ్యామ్‌లను నిర్మించ తలపెట్టారు. చెక్‌డ్యామ్‌లో నిర్మించే ప్రాంతంలో పెద్దఎత్తున ఇసుక నిల్వలు పేరుకుపోవడంతో ఇసుక తవ్వకాలు చేపట్టాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు సంబంధిత అధికారులు 2021 డిసెంబరులో సర్వే నిర్వహించి జిల్లాలోని సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, మంథని మండలాల పరిధిలో 25 ఇసుక రీచులను గుర్తించారు. వీటి నుంచి కోటి 32 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడాలని నిర్ణయించారు. జనవరిలో టీజీఎండీసీ అధికారులు రెండేళ్ల కాలపరిమితి కోసం టెండర్లు ఆహ్వానిం చారు. కాంట్రాక్టర్లు నిర్దేశించిన స్థలంలో ఇసుకను తోడి అక్కడి నుంచి డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంటుంది. ఇసుక తీసుకువెళ్లేందుకు లారీల్లో లోడింగ్ చేయాల్సి ఉంటుంది. 25 క్వారీల్లో 23 క్వారీలు మాత్రమే నడిచాయి. నీరుకుళ్ల, కదం బాపూర్, గట్టెపల్లి, గుండ్లపల్లి, కనగర్తి, మడక, ఇందుర్తి, గూడెం, కిష్టంపేట, ఓడేడు, అడవి శ్రీరాంపూర్, తదితర ప్రాంతాల్లో ఇసుక రీచులకు ఏర్పాటు చేశారు. ఈ రీచుల కోసం ఇసుక డంపింగ్ యార్డులు, దారుల కోసం, వే్‌బ్రిడ్జి కోసం ఒక్కో రీచుకు 30 నుంచి 40 ఎకరాల భూములను మానేరు తీరం వెంబడి ఉండే రైతుల నుంచి టీజీఎండీసీ అధికారులు లీజుకు తీసుకున్నారు.



గుండ్లపల్లి, కనగర్తి 2 క్వారీల వద్దకు వెళ్లకుండా దారుల్లో తీసిన కందకాలు

● టీజీఎండీసీ కార్యాలయం చుట్టూ రైతులు

పెద్దపల్లి జిల్లాలో కూడా ఇసుక క్వారీలు ప్రారంభించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మానేరు నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టడాన్ని అధికార పార్టీకి చెందిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇసుక క్వారీలను ఎట్టి పరిస్థితుల్లోనూ నడవనిచ్చేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. అంతేగాకుండా స్థానిక అవసరాల కోసం అమల్లో ఉన్న స్యాండ్ ట్యాక్సీ విధానం ఎత్తివేసేలా చేశారు. ప్రస్తుతం మానేరు నుంచి ప్రజలకు ఎలాంటి సీనరేజీ పన్నులు లేకుండా ఉచితంగానే ఇసుక సరఫరా చేస్తున్నారు. రోజుకు 300 నుంచి 400 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను ట్రాక్టర్ల యజమానులు వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. టీజీఎండీసీ ఇసుక రీచులు నిలిచిపోవడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రాకపోయినప్పటికీ, టీజీఎండీసీ అధికారులు క్వారీల కోసం తమ నుంచి లీజుకు తీసుకున్న భూములకు ఒక్క ఏడాది మాత్రమే డబ్బులు చెల్లించారని, రెండేళ్లుగా డబ్బులు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని క్వారీల వద్ద ఇసుక డంపులు ఉన్నాయని చెబుతున్నారు. తమకు డబ్బులు ఇవ్వకపోగా క్వారీల కాంట్రాక్టును కూడా రద్దు చేయడం లేదని చెబుతున్నారు. తమ భూములను తిరిగి సాగులోనికి తీసుకురావాలంటే పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి ఉంటుందంటున్నారు. రోడ్లను తవ్వాల్సి ఉంటుందని, భూములను లెవెలింగ్ చేసి ఒడ్లు పోసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే ఇటు లీజు డబ్బులు రాక ఏడాదికి రెండు సీజన్లలో, రెండేళ్ల పంటలు పండించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇసుకను తోడి డంపింగ్ యార్డుకు తరలించి వాహనాల్లో లోడింగ్ చేయడం వల్ల కాంట్రాక్టర్లకు టీజీఎండీసీ ఒక్కో క్యూబిక్ మీటర్‌కు 116 రూపాయల వరకు చెల్లిస్తుంది. క్వారీలు ప్రారంభమైన నాటి నుంచి బిల్లులు రాలేదని, సుమారు 92 కోట్ల రూపాయల వరకు బిల్లులు రావాల్సి ఉన్నాయని, వాటి కోసం కాంట్రాక్టర్లు టీజీఎండీసీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం స్పందించి రెండేళ్ల లీజు డబ్బులు చెల్లించి, లీజులను రద్దు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

● ఎన్జీటీని ఆశ్రయించిన పర్యావరణవాదులు

పర్యావరణ అనుమతులు లేకుండానే ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేశారని, ఈ ప్రాంతంలో పర్యావరణం దెబ్బతింటున్నదని, క్వారీలను నిలిపివేయాలని కొందరు పర్యావరణవాదులు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) కోర్టును ఆశ్రయించారు. దీంతో 2022 డిసెంబరులో తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఇసుక క్వారీలను ఆపాల్సిందిగా కోర్టు స్టే ఇచ్చింది. అలాగే సంబంధిత పర్యావరణ అనుమతులను సమర్పించాలని టీజీఎండీసీ అధికారులను ఆదేశించింది. అప్పటి వరకు ఈ రీచ్‌ల్లో 80 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను అధికారికంగా విక్రయించారు. అంతేగాకుండా ఇదే మానేరుపై అవతలి వైపు కరీంనగర్ జిల్లాలో 12 క్వారీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఏడు క్వారీలు నడిచాయి. వీటిని కూడా నిలిపివేయాలని పలువురు కోర్టుకు వెళ్లడంతో కోర్టు స్టే విధించింది. అప్పటి టీజీఎండీసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల 17 నెలల పాటు స్టే కొనసాగింది. 2024 మే నెలలో ఎన్జీటీ కోర్టు తుది తీర్పును వెలువరించింది. గనులు, భూగర్భ, ఇరిగేషన్ శాఖలకు భారీగా జరిమానా కూడా విధించింది. పర్యావరణ అనుమతులను తీసుకుని క్వారీలను నడుపుకోవాలని ఆదేశించింది. క్వారీల కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టర్ల కాలపరిమితి పూర్తి కావడం, నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఇసుక తవ్వకాలు పూర్తికాకపోవడంతో కాంట్రాక్టర్లు తమ కాంట్రాక్టును పొడిగించాలని ప్రభుత్వాన్ని ఆశ్రయించడంతో ఒక ఏడాది పాటు 2025 మార్చి నెలాఖరు వరకు కాంట్రాక్టును పొడిగించారు. కోర్టు ఆర్డర్‌తో ఇసుక క్వారీలు నిలిచిపోవడంతో ప్రస్తుత ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి స్టే తీసుకువచ్చింది. ఆయా క్వారీల వద్ద ఉన్న ఇసుక నిల్వలను తరలించాలని, తవ్వకాలు చేపట్టాలని మూడు జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం గత ఏడాది ఆదేశాలు జారీ చేసింది. దీంతో కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇసుక క్వారీలను అక్కడి కలెక్టర్లు ఇసుక క్వారీలను ప్రారంభించారు.

పోటీ పరీక్షల్లో రాణించాలి

- గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణి



అధికారులతో మాట్లాడుతున్న అలుగు వర్షిణి

చొప్పదండి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణి సూచించారు. శనివారం మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అలుగు వర్షిణి మాట్లాడుతూ రాబోయే ఎన్‌డీఏ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని, జేఈఈ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించాలన్నారు. అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షల్లో సైనిక్ స్కూల్ నుంచి 22 మంది క్యాడెట్‌లు, మొత్తం సొసైటీలోని అన్ని పాఠశాలల నుంచి 169 సీట్లు సాధించారని తెలిపారు. ఎన్‌డీఏ రాత పరీక్షల్లో విజయం సాధించలేని విద్యార్థులకు అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పారామిలిటరీ దళాలు, సివిల్ సర్వీసెస్, కస్టమ్స్, రెవెన్యూ సర్వీసుల్లో చేరేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె డ్రిల్, శారీరక శిక్షణ, ట్రెక్కింగ్, బ్యాంకింగ్, రెజ్లింగ్‌ను పరిశీలించి క్యాడెట్లతో మాట్లాడారు. సైనిక్ స్కూల్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ అధికారి ఎం భీమయ్య, హెడ్ ఆఫీస్ సి బృంది శర్మ, కిశోర్, పాఠశాల డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ జి కాళహస్తి, సిబ్బంది పాల్గొన్నారు.



బాక్సింగ్‌లో తలపడుతున్న వర్షిణి

ఐదో రోజుకు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె

గణేశ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు, పార్ట్ టైమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేపట్టిన సమ్మె శనివారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది సమ్మెకు సంఘీభావం తెలిపారు. అనంతరం బోధనేతర సిబ్బంది సంఘం ప్రధాన కార్యదర్శి పి ప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని, సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. జీవో 21ని సవరించాలని, పార్ట్ టైం అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సంతోష్, శ్రీకాంత్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న పి ప్రసాద్

ఎస్సారార్‌లో అకడమిక్ కౌన్సిల్ సమావేశం



సమావేశానికి హాజరైన సభ్యులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ అధ్యక్షతన మూడో అకడమిక్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు 2022-23లో అటానమస్ హోదా వచ్చిందని, ఈ సారి మూడో సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఈ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన కరికులంను రూపొందించినట్లు, పరిశ్రమలతో సిలబస్ అనుసంధానం చేస్తూ నూతన సిలబస్‌ను తయారు చేసినట్లు చెప్పారు. అనంతరం అటానమస్ కోఆర్డినేటర్ డాక్టర్ వంగల శ్రీనివాస్ అకడమి కౌన్సిల్ నివేదికను ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజభాస్కర్ రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ నుంచి డాక్టర్ సరసిజ, డాక్టర్ సురేష్, డాక్టర్ పద్మావతి, కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యుడు డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి పలు సూచనలను అందించారు.ఈ సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్, రాజయ్య, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని స్టేడియంలో మాబ్ ఆపరేషన్




మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సింగరేణి స్టేడియంలో పోలీసులు శనివారం మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ ప్రాక్టిస్ నిర్వహించారు. ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్, రామగుండం సర్కిల్ సివిల్ పోలీసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీపీ కరుణాకర్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ, ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తూ అల్లరి మూకలు విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భంలో సమయస్ఫూర్తితో జన సమూహాలను నియంత్రించడం, శాంతి భద్రతలను కాపాడానికి మాబ్ ఆపరేషన్- మాక్ డ్రిల్ ప్రాక్టిస్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్న సందర్భంలో పోలీస్‌శాఖ ఎలా వ్యవహరిస్తుంది, ఘర్షణలకు పాల్పడిన వారిపై ఏ విధంగా చర్యలు తీసుకుంటారనే దాని గురించి అవగాహన కల్పించేందుకే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఒక వైపు ప్లకార్డులు పట్టిన ఆందోళనకారులు, అల్లరిమూకలు, మరో వైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు మాబ్ నిర్వహించారు. జన సమూహాలను నియంత్రించేందుకు మొదట హెచ్చరికలు, వినకపోతే మేజిస్ట్రేట్, ఉన్నతాధికారుల అనుమతితో బాష్పవాయువు ప్రయోగం, 3వ దశలో ఫైర్ సిబ్బంది వాటర్ కెనాన్ ప్రయోగం, ఉద్రిక్తత పరిస్థితుల్లో ఆత్మరక్షణకు లాఠీచార్జి, ప్లాస్టిక్ పెల్లెట్స్‌తో ఫైరింగ్, అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటి వారి గురించి ఆర్ఎస్ఐ శివకుమార్, హెడ్ కానిస్టేబుల్ రఫి ప్రాక్టిస్ చేయించారు. సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ప్రవీణ్‌కుమార్, రాజేశ్వర్‌రావు, ఎస్ఐలు రమేష్, భూమేష్, ఉదయ్ కిరణ్, మానస, సంధ్యారాణి, వెంకట్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల ఫిర్యాదుకు వాట్సాప్ చాట్‌బాట్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ విని యోగదారులకు మరింత ఉత్తమ సేవలు అందించేందుకు 1912 టోల్ ఫ్రీ నంబరుతోపాటు కొత్తగా వాట్సాప్ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కరీంనగర్ సర్కిల్ సూపరిం టెండింగ్ ఇంజనీర్ రమేష్‌బాబు తెలిపారు. శనివారం కార్యాలయంలో వాట్సాప్ చాట్‌బాట్ వినియోగంపై వివరించారు. మొదటగా వినియోగదారులు మొబైల్ నుంచి వాట్సాప్‌లో 7901628348 నంబరుకు 'హాయ్' అని చాట్ చేయగానే 'హాయ్ టీజీఎన్‌పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం' అని వస్తుంది. అందులో రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ అని ఉంటుంది. రిజిస్టర్ కంప్లైంట్ ఎంటర్ చేయగానే విత్ యూనిక్ సర్వీస్ నంబరు, విత్‌అవుట్ యూనిక్ సర్వీస్ నంబరు, ప్రీవియస్ మెనూ అని వస్తాయి. విత్ యూనిక్ సర్వీస్ నంబరు ఎంటర్ చేయగానే వినియోగదారుడి విద్యుత్ సర్వీస్ వివరాలు కనిపిస్తాయి. ఇలా వివరాలను ఓకే చేయగానే కంప్లైంట్‌కు సంబంధించిన వివిధ రకాలు మెనూలో కనిపిస్తాయి. అందులో కంప్లైంట్‌కు సంబంధించి సబ్ టైప్ లేదా చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది. ఇలా ఏజెంట్‌తో చాట్ చేయవచ్చు లేదా కంప్లైంట్ నమోదు చేసుకోవచ్చు. కంప్లైంట్ ఐడీతో ఒక నంబరు జనరేట్ అవడంతో ఫిర్యాదు నమోదవుతుంది. తర్వాత చర్యల నిమిత్తం సంబంధిత అధికారికి నివేదించినట్లు వినియోగదారుడికి సమాచారం రూపకంగా మెసేజ్ వెళ్తుంది. భవిష్యత్‌లో కంప్లైంట్ ఐడీతో వినియోగదారుడు సమస్యను ట్రాక్ చేసుకోవచ్చు. ఫిర్యాదు పూర్తయిన తర్వాత వినియోగదారుడికి సమాచారంతోపాటు ఐవీఆర్ఎస్ ద్వారా కాల్ వస్తుంది. సమస్య పరిష్కరించిన తర్వాత ఫీడ్ బ్యాక్ అడుగుతుంది. సంతృప్తి చెందని పక్షంలో ఫిర్యాదు రీ ఓపెన్ చేయాలని అడుగుతుంది. టీజీఎన్‌పీడీసీఎల్ వెబ్ సైట్‌లోనూ వాట్సాప్ ఐకాన్ కనిపిస్తుంది. ఐకాన్‌క్లిక్ చేసుకొని చాట్ చేయవచ్చు. సత్వర విద్యుత్ సమస్యలను పరిష్కారానికి వాట్సాప్ చాట్‌బాట్ ఉపకరిస్తుందని ఎస్ఈ రమేష్‌బాబు తెలిపారు.



ఫిర్యాదు కోసం అందుబుబాటులోకి తెచ్చిన 'వాట్సాప్ చాట్‌బాట్'

రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలు ప్రారంభం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అమెచ్యూర్ ఉషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండ పంలో రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలను జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి అజ్మీరా రాందాస్ శనివారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలు జిల్లాల వారీగా వివిధ విభాగాల్లో పోటాపోటీగా క్రీడాకారులు పంచ్‌లు, కిక్‌లతో తలపడ్డారు. రాష్ట్రస్థాయి 3వ సబ్ జూనియర్స్, జూనియర్స్, 2వ రాష్ట్రస్థాయి సీనియర్ ఉషూ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. మూడు రోజులపాటు పోటీలు జరగనుండగా, 19 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి రాందాస్‌ను అమెచ్యూర్ ఉషూ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఉమర్, రాజన్న సిరిసిల్ల అధ్యక్షుడు ఎస్ రవితేజ, ప్రధాన కార్యదర్శి అఖిల, కోశాధికారి భవాని, వివిధ జిల్లా క్రీడాకారులు, మేనేజర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.



పోటీ పడుతున్న బాలికలు

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ లండన్‌లో నిరసన

ఇల్లంతకుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ లండన్‌లోని పాకిస్తాన్ హైకమిషన్ ఎదుట నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఓవర్సీస్ బీజేపీ యూకే కోర్ కమిటీ సభ్యుడు సచిందర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో అలజడులు సృష్టించడానికి కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఓవర్సీస్ బీజేపీ యూకే నాయకులు షణ్ముఖ్, వాస భారత్, వివేకవర్ధన్‌రెడ్డి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



లండన్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

కార్పొరేట్‌కు దీటుగా బోధన

- మోడల్ స్కూళ్లలో సకల సౌకర్యాలు
- నేడు ప్రవేశ పరీక్ష

వెల్గటూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పిల్లలకు నాణ్యమైన విద్యను అందిం చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంత పేద, మధ్య తరగతి విద్యార్థులకు మోడల్ స్కూళ్లు వరం లాంటివి. ఆంగ్ల మాధ్యమంలో చదవాలనుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులను మోడల్ స్కూళ్లు తీర్చి దిద్దుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించేందుకు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ సమీపంలో గ్రామీణ ప్రాంతాల్లోనే నాణ్యమైన విద్య అందుతోంది. ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆదివారం అన్ని మండలాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఇంటర్ చదువుతున్న బాలికలకు హాస్టల్ సౌకర్యం కూడా ఉండటంతో ఎక్కువ మంది నిరుపేద బాల బాలికలు ఆదర్శ పాఠశాలల వైపు చూస్తున్నారు.

● కల్పిస్తున్న వసతులు

ఆదర్శ పాఠశాలలో చదివే విద్యార్థులకు అనేక వసతులు కల్పిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. విశాలమైన తరగతి గదులు, ల్యాబ్ సౌకర్యం, ఉచిత పుస్తకాలు, దుస్తులు, డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, మధ్యాహ్న భోజనం, ప్రత్యేక తరగతులు, కాస్మోటిక్ కిట్లు, ఎంసెట్, ఎన్ఐటీ తదితర కోచింగ్ ఇస్తున్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, ఒకేషనల్ ల్యాబ్‌లు బాల బాలిక లకు ఉపయుక్తంగా ఉంటున్నాయి. ఒక్కో పాఠశాలలో 6వ తరగతిలో 100 సీట్లు ఉన్నాయి. 7,8,9,10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారు. ఆరో తరగతిలో ప్రవేశిస్తే ఇంటర్ వరకు అక్కడే చదువుకునే అవకాశం ఉంటుంది. జగిత్యాలజిల్లాలో 13 ఆదర్శపాఠశాలలు ఉన్నాయి.



కుమ్మరిపల్లి మోడల్ స్కూల్

పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ

- కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్, కుమ్మరిపల్లి మోడల్‌స్కూల్, జగిత్యాల జిల్లా



మోడల్ స్కూల్‌లో అన్ని సదుపాయా లతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక చొరవతో మంచి ఫలితాలు వస్తున్నాయి. విద్యార్థులు కూడా కష్టపడి చదువుతున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరం డిప్లొమా కోర్సులకు అనాథ బాలికలు, నిరాశ్రయులైన పిల్లలు, బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 240 సీట్లలో 70 శాతం సీట్లు అనాథ బాలికలు, తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద బాలికలు, అక్రమ రవాణా బాధిత బాలికలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా పదోతరగతి ఉత్తీర్ణ పొంది ఉండాలని, మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించారని తెలిపారు.

ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతోపాటు వసతి కల్పిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు, ధ్రువీకరణపత్రాలతో మే 20న సాయంత్రం ఐదు గంటలలోపు సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా పరిషత్ కార్యాలయంలోని బాల రక్షాభవన్, రెండో అంతస్తులోని జిల్లా బాలల పరిరక్షణ విభాగంలోగానీ, 7396424387 ఫోన్ నంబరులోగానీ సంప్రదించాలని సూచించారు.

29న ముడుపుల వస్తువులకు వేలం

మల్యాల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టు ఆంజనేయస్వామికి దీక్షాపరులు సమర్పించిన ముడుపుల వస్తువులకు ఈనెల 29న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యానికి డిపాజిట్ 10వేల రూపాయలు, కొబ్బరికాయలకు, ఎండు కుడుకలకు, ఇత్తడి గంటలకు ఐదు వేల రూపాయలు, ఎండు ఖర్జూరాలు, పోకలకు వెయ్యి రూపాయలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. వేలం ముగిసాక హెచ్చు పాటదారు వెంటనే సొమ్ము చెల్లించి వస్తువులను తీసుకెళ్లాలని సూచించారు.

కొను'ఘొల్లు'


బోయినపల్లిలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం


రుద్రంగిలో ధాన్యం నిల్వలు

(5వ పేజీ తరువాయి)

పేరుకుపోయింది. హమాలీలు లేకపోవడం, తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించడానికి లారీల కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల నుంచి కేంద్రాల్లోనే నిరీక్షిస్తున్నారు. ఎండ తీవ్రతకు కేంద్రాల్లో టెంట్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల చెట్ల కింద కూర్చోవలసి వస్తోందని రైతులు వాపోతున్నారు. తాగేందుకు నీరు లేక ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో బస్తాకు 42.5 కిలోల తూకం వేస్తున్నారని పేర్కొన్నారు. తరుగు పేరిట 2.5 కిలోలు కోత విధిస్తున్నారని రైతులు చెబుతున్నారు.

ధాన్యం తూకం వేయడంలో ఆలస్యం

ఇల్లంతకుట : మండంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడంలో ఆలస్యం అవుతోంది. మండలంలో 28ధాన్యం కొనుగోలు కేంద్రాలు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రారంభం అయ్యాయి. తొలుత మిల్లర్లు ధాన్యం సేకరణకు నిరాకరించడంతో రహీంఖాన్‌పేట గ్రామంలోని గోదాంలకు ధాన్యాన్ని తరలించారు. హమాలీల కొరత, లారీలు రాకపోవడంతో తీవ్రంగా రైతులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం మిల్లులు కేటాయించినా సరిపడా లారీలు రాకపోవడం, సమయానికి గోనె సంచులు ఇవ్వకపోవడంతో కేంద్రాలలో ధాన్యం పేరుకుపోయింది. కొన్ని కేంద్రాల వద్ద తాగునీరు, నీడను సైతం ఏర్పాటు చేయలేదు. వాతావరణంలో మార్పులు వస్తుండటం, తూకం, ధాన్యం తరలింపులో ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని వివిధ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 18 వేల క్వింటాళ్ళ ధాన్యాన్ని సేకరించారు.

లారీల కొరతతో నిలిచిన కొనుగోళ్లు

వేములవాడ టౌన్ : వేములవాడ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రంతో పాటుగా నాంపల్లి, రుద్రవరం సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. పది రోజులుగా ధన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోకి రైతులు తీసుకువచ్చారు. లారీల కొరత ఉండటంతో కొనుగోళ్లు ఆలస్యమవుతోందని రైతులు చెబుతున్నారు. వేములవాడ సింగిల్ విండో ఆధ్వర్యంలో మూడు రోజులుగా లారీలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లడంతో శనివారం రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రెండు లారీలను ఏర్పాటు చేసి కొను గోళ్లను వేగవంతం చేశారు. రుద్రవరం, నాంపల్లి గ్రామంలో లారీల కొరత ఉండటంతో కొనుగోళ్లలో ఆలస్యమవుతోంది.

అకాల వర్షానికి భయపడి..

చందుర్తి : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడుస్తుందని రైతులు భయపడుతున్నారు. దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. అక్కడ వారికి మద్దతు ధర లభించకపోగా బోనస్‌ను కోల్పోతున్నారు. మండలంలో ధాన్యం సేకరణకు ఐకేపీ ఆధ్వర్యంలో 13, సనుగుల సింగిల్ విండో ఆధ్వర్యంలో 4 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఐకేపీ ఆధ్వర్యంలో 25,203 క్వింటళ్ల ధాన్యం కొనుగోలు చేసి 13,806 క్వింటాళ్ల ధాన్యం గోదాంలకు తరలించారు. కొనుగోలు కేంద్రాల్లో 11,397 క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉంది. సనుగుల సింగిల్ విండో పరిధిలో 8500 క్వింటాళ్ల కొనుగోలు చేయగా 6200 క్వింటాళ్ల ధాన్యం గోదాంలకు తరలించగా, 2300 క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉంది. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడిచిపోతుందనే భయంతో ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నారు. శనివారం అన్ని కేంద్రాలకు రైస్ మిల్లులు అలాట్ అయినట్లు నిర్వాహకులు తెలిపారు.


రాచర్లబొప్పాపూర్‌లో చెట్ల కింద కూర్చున్న మహిళా రైతులు

కల్లాల్లో అన్నదాతల కష్టాలు..

వీర్నపల్లి : వీర్నపల్లి మండలంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ధాన్యం పోసి నెల రోజులు గడుస్తున్నా కాంటా పెట్టడం లేదు. తూకంవేసిన ధాన్యం బస్తాలు తరలించేందుకు లారీలు రాకపోవడంతో ఎక్కడికక్కడ సంచులు నిల్వ ఉన్నాయి. సెంటర్ నిర్వాహకులు రైతులకు కనీసం తాగునీటి వసతి కల్పించడం లేదు. నీడ కోసం టెంట్ వేసినా జాడే లేదు. కొన్ని సెంటర్లలో ప్రభుత్వం అందించిన టార్పాలిన్ కవర్లను రైతులకు అందించడం లేదు. ఎండలో పనిచేసే హమాలీ కూలీలకు వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడం లేదు.

కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం

రుద్రంగి : మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో, అలాగే సింగిల్ విండో ఆధ్వర్యంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. లారీల కొరత వల్ల కొనుగోళ్లలో జాప్యం జరగ డంతో ధాన్యం పెరుకుపోతోంది. దీంతో ధాన్యం కొనుగోళ్లు ముందుకు సాగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిస్తే మళ్లీ ఆరబెట్టాల్సి వస్తుందేమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు రెండు కొనుగోలు కేంద్రాల నుంచి సూమారు 15 లారీల ధాన్యం వెళ్లింది.

విలీన గ్రామాల్లో నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లు

సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల మున్సిపాల్టీలోని విలీన గ్రామాల్లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయినా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విలీన గ్రామాలైన రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్ గ్రామాలతోపాటు సర్ధాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకవచ్చి నెల రోజులు గడుస్తున్నా వారం రోజుల క్రితం ఒక్కసారి తూకం వేసి ధాన్యం కొనుగో లు చేసి ఒక్కో లారీ చొప్పున తరలించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా సాయంత్రం అకాల వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం తడవ కుండా టార్పాలిన్ కవర్లను కప్పుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.


వీర్నపల్లిలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు

సగం ధాన్యం దళారుల పాలే..

బోయినపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సకాలంలో తూకం వేయకపోవడంతో మండలంలో సగ ధాన్యం దళారులే కొనుగోలు చేస్తున్నారు. ఓవైపు మేఘాలు కమ్ముకోవడంతోపాటు కొనుగోలు కేంద్రాల్లో వసతులు లేకపోవడంతో రైతులు ఆందోళన గురవుతున్నారు. దీన్ని ఆసరా చేసుకొని దళారులు తేమ అధికమున్న ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి..

- మర్రి రాములు, రైతు, చందుర్తి



ధాన్యం విక్రయించేందుకు 20రోజులక్రితం కేంద్రానికి తీసుకవచ్చాను. ఒకరోజు గన్ని సంచులు లేవని, మరో రోజు రైస్ మిల్లులు అలాట్ కాలేదని, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు చెప్తున్నారు. ధాన్యం తూకం వేసిన హమాలీలు ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేసి, మళ్లీ గోదాముల్లో ఇక్కడి హమాలీలే అక్కడికి వెళ్లి లారీల్లో ధాన్యాన్ని అన్లోడ్ చేసి రావడంతో ఆలస్యం జరుగుతుంది. కొనుగోళ్లను వేగవంతం చేయాలి.

అన్ని వసతులు కల్పించాలి..

- అజ్మీర శోభ, జవహర్‌లాల్ తండా, వీర్నపల్లి



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలి. తాగునీరు అందించి, నీడ కోసం సరిపడా టెంట్లు సెంటర్ నిర్వాహకులు వేయించాలి. ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో జాప్యం చేయవద్దు.

నెల రోజులుగా పడిగాపులు..

- గుగ్గిళ్ల ఎల్లయ్య, పెద్దూర్, సిరిసిల్ల



పెద్దూర్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేంద్రంలో ధాన్యం విక్రయించేందుకు తీసుకవచ్చి నెలరోజులు గడుస్తున్నా ఇంతవరకు కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యంను వెంటనే కొనుగోలు చేయాలి.

ఆరబోసుకోవడానికి స్థలం లేదు..

- కొమ్మటి యాదిరెడ్డి, రైతు, జిల్లెల్ల



కొనుగోలు కేంద్రంలో మ్యాచర్ వచ్చేంత వరకు ధాన్యాన్ని ఆరబోసుకోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నాం. గతంలోకంటే ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రం బాగా పని చేస్తోంది. గతంలో వడ్లు తూకం వేయడానికి హమాలీలకు డిమాండ్ ఉండేది. ప్రస్తుతం వరుస క్రమంలో ధాన్యాని తూకం వేస్తున్నారు.

పనులన్నీ వదులుకుని ఉంటున్నా..

- పిట్ల సుదర్శన్, రైతు- రాచర్లబొప్పాపూర్



మాది రాచర్లబొప్పాపూర్. గ్రామశివారులోని కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చాను. తేమ శాతం వచ్చినా కొనేటోళ్లలేరు. హమాలీలు, లారీలు వస్త లేవని కాంటాలు పెట్టలేరు. 20 రోజుల నుంచి పనులన్నీ వదులుకుని వడ్ల వద్దే ఉంటున్నా. అధికారులు స్పందించి కొనుగోళ్లు చేపట్టి ఇబ్బందులు తీర్చాలి.

ధాన్యం పోసి 13 రోజులు..

- దయ్యాల మహేష్, ఇల్లంతకుంట



మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పోసి 13రోజులు అవుతున్నా తూకం కాలేదు. ప్రతిరోజు ఉదయం కేంద్రానికి వెళ్లడం ఇబ్బందిగా మారింది. మిల్లులను తొలుత కేటాయించకపోవడం, సరైన సమయానికి లారీలు రాకపోవడంతో తూకం వేయడం ఆలస్యం అవుతోంది. త్వరగా సేకరించాలి.

లారీలను ఏర్పాటు చేయాలి..

- పి. బుజ్జవ్వ, శాత్రాజుపల్లి



వేములవాడ సింగిల్ విండోలో ధాన్యం విక్రయించేందుకు తీసుకువచ్చాను. వారం రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకవచ్చి ఆరబెట్టాను. లారీల కొరతతోనే ధాన్యం కొను గోళ్లలో ఆలస్యం అవుతోంది. ప్రభుత్వం చొరవ తీసుకుని లారీలను ఏర్పాటు చేస్తే కొనుగోళ్లు వేగవంతం అవుతాయి.

ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికకు సర్వే


చందుర్తిలో సర్వే చేస్తున్న అధికారులు

చందుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన వారి ఎంపికకు ఇన్‌చార్జి ఎంపీడీవో బండి ప్రదీప్‌కుమార్ శనివారం సర్వే నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల్లో అర్హులను గుర్తించేందుకు సర్వే బృందాలు రంగంలోకి దిగాయి. మండలంలో జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షనలో ప్రతి గ్రామంలో గెజిటెడ్‌స్థాయి అధికారి సుమారు 200 దరఖాస్తులను సర్వే చేస్తున్నారు. దీనికి సంబంధించిన ముఖ్యమైన పలు అంశాలుపై సర్వే నిర్వహిస్తున్నారు. సర్వేలో పంచాయతీ కార్యదర్శి శ్రీరివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్పీకి మహనీయుల జయంత్యుత్సవ ఆహ్వానపత్రిక

ఇల్లంతకుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఈనెల 30న జరిగే మహనీయుల జయంత్యుత్సవ ఆహ్వాన పత్రికను శనివారం ఎస్పీ మహేష్ బి గితేకు అందించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. వీరిలో ఉత్సవ కమిటీ కన్వీనర్ సావనపెల్లి రాకేష్, నాయకులు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి, సావనపెల్లి శంకర్, మచ్చ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ పాఠశాలలో ఆదివారం ప్రవేశ పరీక్ష ఉన్నందున విద్యార్థులు సమయానికి కేంద్రానికి చేరుకోవాలని మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఉదయం 10గంటలకు 6వ తరగతిలో ప్రవేశానికి, మధ్యాహ్నం 2గంటలకు మిగతా తరగతులలో ప్రవేశానికి పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

పహల్గాం దాడిపై నిరసనల వెల్లువ


సిరిసిల్లలో కొవ్వొత్తుల ర్యాలీ


ఎల్లారెడ్డిపేటలో..


పెద్ద లింగాపూర్‌లో..

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి ఉగ్రవాదుల దాడులో మరణించిన దేశ పౌరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేంహేందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధానకార్యదర్శి మ్యాన ప్రసాద్, పెద్దపల్లి జిల్లా పార్టీ అబ్జర్వర్ సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు డి వెంకటేశం, కాసర్ల రాజు, నక్క నర్సయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మాండ్లు, మాజీ కౌన్సిలర్లు కుడికాల రవికుమార్, వేముల రవి, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు కంసాల మల్లేశం, గుండ్లపెల్లి గౌతమ్, రాపెల్లి కళ్యాణ్, కల్లూరి చందన, రేజా, రాగుల రాములు, అన్నల్‌దాస్ భాను, గుజ్జె రమేష్ పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండలం నాగం పేట గ్రామంలో శనివారం రాత్రి గ్రామస్థులు యువకులు, పిల్లలు ఉగ్రవాదుల దాడిలో అమరులైన పర్యాటకుల ఆత్మ శాంతి కలగాలని కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. పహల్గాం ఘటనలో అమరులైన వారి కుటుంబాలకు మనమంతా అండగా నిలుద్దామంటూ జై హింద్, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు.

ఎల్లారెడ్డిపేట : జమ్మూ కశ్మీర్ పహల్గాం ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. పర్యాటకులపై దాడి చేయడం అమానుషమన్నారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ఉగ్రవాదుల దాడి నిరసిస్తూ పెద్ద లింగాపూర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శనివారం మృతులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పసుల నరేష్, నాయకులు గన్నారం నరసయ్య, పసుల బాలరాజు, రామంచ లచ్చయ్య, జనగాం శ్రీను, ప్రవీణ్, అనిల్, సంజిత్, జాన్, వేణు పాల్గొన్నారు.

రుద్రంగి : జమ్ము కాశ్మీర్ ఉగ్రవాదులు జరిపిన దాడులకు నిరసనగా హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో రుద్రంగి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందగా బంద్‌లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాడపు వేంకటేష్, గంగం మహేష్, పడాల గణేష్, ఇప్ప మహేష్, దయ్యాల కమాలాకర్, బోయిని రాజు, కంటే రెడ్డి, మీసాల రవి, కర్నవత్తుల దేవేంధర్, బోళ్ల నర్సారెడ్డి, గంటే ప్రశాంత్, పడాల గజానంద్ పాల్గొన్నారు.

వేములవాడ : పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ శనివారం సాయంత్రం వేములవాడలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్థూపం వద్ద అమరులకు నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు సంతాపాన్ని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, సీనియర్ నాయకుడు రామతీర్థపు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్లు నిమ్మచెట్టి విజయ్, సిరిగిరి చందు, గోలి మహేష్, నరాల శేఖర్, జోగిని శంకర్, రూరల్ మండల అధ్యక్షుడు గొస్కుల రవి తదితరులు పాల్గొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో వేములవాడలో ఉగ్ర వాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. వేములవా డ పట్టణ సీపీఐ పార్టీ కార్యదర్శి గాజుల పోశెట్టి, రూరల్ మండల కార్యదర్శి శ్రీరాముల నర్సయ్య, పెంట మల్లయ్య, బొంబాయి లక్ష్మణ్, శ్రీనివాస్, శేఖర్, రాజన్న తదితర సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.





రుద్రంగిలో బైక్ ర్యాలీ, వేములవాడలో అమరులకు నివాళులర్పిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

న్యాయమూర్తులను కలిసిన 'మాక్స్' సభ్యులు


న్యాయమూర్తులకు పూలమొక్కను అందజేస్తున్న మాక్స్ సభ్యులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా సిరిసిల్ల జిల్లా కోర్టులో బాధ్యతలు స్వీకరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ. నీరజ, 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా జడ్జి వి. పుష్పలతలను శనివారం మ్యాచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ(మాక్స్) సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ ఉద్దేశ్యాన్ని వివరించి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ గోవిందు భాస్కర్, ప్రధానకార్యదర్శి ఇరుకుల్ల అశ్విన్ చంద్ర, డైరెక్టర్లు పొత్తూరి అనిల్‌కుమార్, వెంకటరెడ్డి, గుర్రం ఆంజనేయులు, పరుశరాములు, శ్రీనివాస్, జ్యోతిలు పాల్గొన్నారు.

టీజీ ఐపాస్ అనుమతులు జారీ చేయాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

సిరిసిల్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో త్వరగా పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టీజీ ఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో జారీచేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ, పరిశ్రమల స్థాపన టీఎస్‌ఐపాస్, టీప్రైడ్ సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. జిల్లాలో టీజీఐపాస్ అమలవుతున్న విధానం తీరుతెన్నులను తెలుసుకున్నారు. జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సకాలంలో జారీ చేయాలన్నారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించిన 27 ప్రతిపాదనల్లో 21 ప్రతిపాదనలకు వివిధ శాఖలు జారీ చేసిన అనుమతులను సమీక్షించి మిగిలిన ఆరు ప్రతిపాదనలను తక్షణమే సమీక్షించి అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ అన్నారు. జారీ చేసిన అనుమతులు ఆన్‌లైన్‌లో ఉండాలన్నారు. జిల్లాలో టీప్రైడ్ పథకం కింద మంజూరు చేసిన 42 యూనిట్ల ఫైల్స్ సంపూర్ణ వివరాలు అందించాలన్నారు. టీ ప్రైడ్ కింద అందించిన ట్రాక్టర్లను గతంలో అక్రమ ఇసుక రవాణాకు వాడుతున్నారని, భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం హన్మంత రావు, టీజీ ఐఐసీ జోనల్ మేనేజర్ మహేశ్వర్, రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శని త్రయోదశి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో ఏర్పాటుచేసిన శనిశ్వరుని పూజల్లో 200మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామిఆలయ కమిటీ సభ్యులు దుబ్బ విశ్వనాథం, కూన సురేష్, ప్రయాకర్‌రావు మధుసూదన్, బొందుగుల శ్రీనివాస్, అయ్యప్ప రవీందర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, పదిర, రాగట్లలపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను శనివారం చేపట్టారు. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, రాజేందర్, కిష న్, బాబు, శ్రీనివాస్, బాలయ్య, తిరుపతిరెడ్డి, బాల్‌రెడ్డి, రాములు, చందు, బుచ్చాగౌడ్, పర్శరాములు, మల్లారెడ్డి, నాగరాజు, రవి, రాజయ్య, వెంకటేశ్, మహేందర్ ఉన్నారు.

బాధితులకు పరామర్శ

గంభీరావుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్‌ను శనివారం సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు. మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ సోదరుడు జావీద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అలాగే మండల కేంద్రంలో రొడ్డ రేణుక, దమ్మన్నపేటలో పుష్ప ఇటీవల మరణించగా వారి ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యండి హమీద్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హనుమాండ్లు, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మిరిశెట్టి తిరుపతి, ఏఎంసీ వైస్‌చైర్మన్, పాతూరి అంజిరెడ్డి, పాక్స్ డైరెక్టర్ మల్యాల రాజ్విర్, పార్టీ సోషల్ మీడియా శంకర్, మండల బీసీసెల్ అధ్యక్షుడు గుర్రం రాజుగౌడ్, యూత్ అధ్యక్షుడు గంగి స్వామి తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన పాత్రికేయుడు పెద్దూరి శ్రీనివాస్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. శ్రీనివాస్ తల్లి కనుకవ్వ అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతిచెందింది. కుటుంబీకులకు శనివారం మంత్రి సానుభూతిని వ్యక్తం చేశారు. వీరిలో జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చింతపల్లి వేణురావు, తూటి పర్శరాం, ర్యాగళ్ళ శ్రీనివాస్, పొన్నం శేఖర్, దొమ్మాటి మహేష్, ఎల్లయ్య, శ్రీనివాస్, పర్శరాం, చంద్రయ్య, జీవన్, నర్సయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

గంభీరావుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట కేజీటు పీజీ కళాశాల ప్రాంగణంలో నేటి నుంచి వేసవి ఉష్ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు జిల్లా ఉష్ కార్యదర్శి రాణావిక్రమగాంధీ తెలిపారు. తరగతులకు అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతుల ప్రారంభానికి రాష్ట్ర ఉష్ కార్యదర్శి మనోహర్, ఉమ్మడి జిల్లాఉష్ కార్యదర్శి విద్యాసాగర్, సిరిసిల్ల జిల్లా కోచ్ శ్రీనివాస్, భానుచందర్, పాల్గొంటారని గాంధీ తెలిపారు.

చలివేంద్రాలు ప్రారంభం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ జగ్గారావు పల్లె గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్ ఏర్పాటుచేసిన చలివేంద్రాలను శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి ప్రారంభించారు. పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.